


## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## సాధారణ బహుమతి పొందిన నవల

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

మారిన ఆమెకు అతని మాటలు చేతగాని వాడి మాటల్లా అనిపిస్తుండగా, "నీతి నిజాయితీ అంటూ ఒంటరిగా ముళ్ల బాటలో నడవటం వల్ల గాయాలు అవడం తప్ప ఏమి సాధించలేమని నీ వల్ల రుజువైంది. నువ్వు నమ్ముకొన్న నీతిని నిజాయితిని పక్కన పెట్టి కాలంతో పాటు పది మంది నడిచిన బాటలో నడిచి నేను ఏం చేయగలనో చూపిస్తా" అంటూ సవాలు విసిరింది నిర్మల.

"నీకేం చెప్పినా నువ్వు అర్థం చేసుకొనే స్థితిలో లేవు. కాని ఏదో ఒక నాడు తెలుసుకొంటావు. చిన్నతనంలో బుడి బుడి నడకలు వేస్తుంటే ఎక్కడ క్రింద పడతారో అని చేతులు పట్టుకొని నడిపిస్తాం. పెద్దయ్యాక తప్పుడడుగు వేస్తున్నారని తెలిసి చేయి అందించినా అందుకునే స్థితిలో మీరుండరు. ఆ పాఠమేదో మీకు కాలమే నేర్పుతుంది .అప్పుడు బాధ పడినా ఫలితముండదు. "

"చూద్దాం నాన్న ఏం జరుగుతుందో ... " అంటూ వెళ్లిపోయింది అక్కడ్నుంచి.

నిర్మలమాటల్తో పరమేశం ఆమె దగ్గర ఉండాలనిపించలేదు. వెంటనే తన భార్యకు ఫోన్ చేసి తన ఊరికి వెళ్లేందుకు సిద్ధమయ్యాడు.

రుద్ర చిత్తూరునుండి వచ్చిన మరుసటి రోజు సాయంకాలం మునిశేఖరం భార్యతో వచ్చాడు. అన్యమనస్కంగా ఉన్నట్లు వాళ్ల ముఖంలో బావాలు చెప్తున్నా , సంధ్య వాళ్లకు విషయం చెప్పిందో లేదో . సంధ్య విషయం మళ్లీ అడిగితే ముఖం మీద ఏలాచెప్పాలి అనుకొంటునే ఆప్యాయంగా పలకరిస్తూ కూర్చోమని చెప్పి కాఫీలు ఇచ్చింది సావిత్రమ్మ . ఇద్దరు కాఫీలు తీసుకోలేదు. ఇప్పడే తాగి వచ్చాం వద్దు అన్నాడు ముక్తసరిగా. బలవంతం చేస్తే తీసుకొని పక్కన పెట్టాడు అతని భార్య మొహమాటానికి తాగినట్లుగా రెండు సిప్పులు తాగి పక్కన పెట్టింది. సావిత్రమ్మకు మనసు చివుక్కమంటున్నా మౌనంగా ఉండిపోయింది. బాధను మనసులో దాచుకొంటూ. ఇక నాన్చడం ఇష్టం లేనట్లు " సంధ్య

విషయం సెప్పినాది. కాని మీరు ఎంతకాదనుకొన్నా మేము  మిమ్మల్ని మరిచిపోలా ఒక మాట సెప్పిపోతామని వచ్చినం“ నిష్టూరంగా అంటూ  రుద్ర అక్కడికి రావడంతో ,“ ఏందిరా నీకు ఆ అబ్బిరెడ్డికి పొసగనట్టుండాదే . ఆయన్తో గొడవలు ఎందుకు పెట్టుకొంటావు. ఆయన సావు ఆయన సావని మనకెందుకు . మనం అంతా ఒకిటికాబోతుండాం. మనం మనం కొట్టుకుంటే మూడో వాడు బాగుపడిపోతాడు. “ అన్నాడు.

“అబ్బిరెడ్డికి రుద్రకు పొసగడంలేదా వాళ్ల మధ్యన గొడవేంది అనుకొంటూ ఏంది రుద్రా మావ చెప్పేది.నీకు అబ్బిరెడ్డికి ఎట్టా పరిచయం మీ మధ్యన గొడవేంది. “అన్నాడు. రుద్రకు పాలుపోలేదు. ఉన్నట్లుండి ఎంకట్రెడ్డి అలా అడిగేసరికి , దానికి జవాబు చెప్పకుండా,

“ మనం మనం ఒకటి కావడమేంది మావ  “ అన్నాడు రుద్ర. వాళ్ల మాటలకు బ్రేక్ చేస్తూ

అంతలోనే మునిశేఖరం భార్య కలగచేసుకొంది.

“మన సంధ్యకు పెళ్లికుదిరినాదొదినా ఈ నెలాకర్న  నిశ్చితార్థం పెట్టుకోవాలనుకొంటుండాం ఆవిషయమే చెప్పిపోదామని వచ్చినం” విషయాన్ని పొడిగించక తాము వచ్చిన పనేందో చెప్తూ.

ఏం అడుగుతారో ఏం చెప్పాల్సి వస్తుందో అది ఎక్కడికి దారితీస్తుందో  అన్న సందేహం ఒక పక్క దూరంకాగా  ,  మరో పక్క తనకు కోడలుగా రావాలని కోరుకొంటున్న సంధ్య మరొకరి పరమైపోతుందని బాధ కలగిస్తుండగా, “ సంధ్యఒప్పుకొన్నాదా  ఎవరి సంబంధం వదినా “అడిగింది  అత్రంగా సావిత్రమ్మ.

“ఒప్పుకోక ఏంచేస్తాది వదినా మాకు మీఇంట సంబంధం కుదుర్చుకోనేంత అదృష్టంలేకపోయే  ఈడొచ్చిన పిల్లని ఎన్ని దినాలు పెట్టుకొంటాం. సంబంధం కుదిరినాది  నిశ్చయతాంబుళాలు పెట్టుకోవాలనుకొంటుండాం.అందుకే పిలవనోచ్చినాం“  బాధగా అంటున్న ఆమె మాటలకు మనసు దేవుతున్నట్లు అనిపిస్తుంటే , దాన్ని పక్కన పెట్టి సంధ్య ఎవరింటి కోడలు కాబోతుందోనన్న అత్రంతో ప్రశ్నల వర్షం కురిపించింది.

“సంబంధం ఎవరొదినా  . ఉజ్జోగస్తుడేనా , బాగా ఉన్న వాళ్లేనా పిల్లోడు బాగున్నాడా  “

“ఉజ్జోగం లేదు కాని ఏదో బిజినెసు సేస్తాడంట . ఎక్కడోడు కాదు మన మండలంలో వోడే అబ్బిరెడ్డి రెండో కొడుకు.  “ అంది ఆమె.

రుద్ర ఉలిక్కి పడ్డాడు. అతనితో పాటు ఎంకట్రెడ్డి కూడా తొందర పడ్డాడేమో మునిశేఖరం అనిపించింది. ఎందుకు అలా చేసావ్ అని అడిగేందుకు ధైర్యం చాల్లేదు ఏలాంటి మాటలు పడాల్సివస్తుందేమోనని.

రుద్ర  ఏ మాత్రం ఆలోచించకుండా “అబ్బిరెడ్డితో సంబంధమా . వద్దు. వద్దు మావ సంధ్య ఆడ సుఖపడేలేదు. వోడి కొడుకు ఎట్టాంటోడు తెలియదుగాని అబ్బిరెడ్డి నీచుడు వోడ్తో మనం వియ్యమొందడమేంది. “అన్నాడు.

“ ఆయన ఎట్టాటోడు అయితే మనకెందుకు.కొడుకు మంచోడైతే సాలు.అయినా అబ్బిరెడ్డి ఎట్టాటోడైనా పలుకుబడి ఉండాది.  రేపోమాపో బెయిల్ మీద బైటికి వస్తాడట . ఆయన మీద ఏసిన కేసు నిలబడదంటా. ఈ పారి గెలిస్తే

మినిస్టరైపోతాడు. ఆయన మన సంబంధం ఒప్పుకోడమే గొప్ప.సింపులుగా నువ్వేమో ఆ సంబంధ వదులుకోమని సెప్తొండావు . అదొదులుకొని ఇంతకన్నా మంచి సంబంధమాడ ఎతకాల. “

కొద్ది క్షణాలు మౌనంగా ఉండిపోయాడు రుద్ర.

రుద్ర మౌనంగా ఉండటం చూసి రెట్టించాడు మునిశేఖరం “చెప్పరా ఇంత కన్నా మంచి సంబంధం యాడ్నించి వస్తాది “అతనికి రుద్ర సంధ్యను వద్దన్నాడని కోపంగా ఉంది రుద్ర మీద .

నిర్మల దగ్గరికి పోయి వచ్చాక , నిర్మల నైజమేమిటో తెలిపోయాక ఆమె పైన ఆశలను చంపుకొన్నాడు రుద్ర . కాని ఏదో తెలియని బాధ అతని వేధించసాగింది. అప్పుడే సంధ్య గురించే ఆలోచించాడు. ఏమాత్రం పరిచయం లేని నిర్మలతో ఉన్న కొద్ది పాటి పరిచయానికే ఆమె తనకు దూరమైందన్న విషయం తట్టుకోవడం కష్టంగా ఉంటే ఊహతెలిసినప్పుటి నుండి తననే ప్రేమిస్తూ తననే ఊహించుకొంటున్న సంధ్య తను వద్దనగానే ఎంత బాధ పడిందో , తను వద్దనగానే , తన మీద ఆశ వదులుకొని విధిలేక కుమిలిపోతూ తల్లితండ్రులు చెప్పినట్లు పెళ్లికి ఒప్పుకొన్నట్లుంది. మరో మంచి సంబంధమైతే ఈలాంటి ఆలోచన వచ్చేది కాదేమో కాని అబ్బిరెడ్డి ల్లాంటి దుర్మార్గుడింటికి కోడలుగా వెళ్లడం అతనికి ఇష్టపడలేదు. అందంతో పాటు చదువు మంచి సంస్కారం ఉన్న తనను అర్థం చేసుకొనే సంధ్య తనెంతగానో ప్రేమిస్తుంది. తను సంధ్యకు చెప్పినట్లు తను ప్రేమించే నిర్మలకన్నా తను ప్రేమించి సంధ్యనుచేసుకోవడమే అభ్యంతరమేముంది అనిపించింది. కొద్దిసేపటికే ఓ స్థిరమైన నిర్ణయానికి వచ్చేసి ,

“ వద్దు అబ్బిరెడ్డితో మనకు సంబంధమే అవసరంలా . అంతేలే మీరు సంధ్యకు ఏ సంబంధమెతకనవసరం లే... “ అన్నాడు.

“ఏం మేము సూడక పోతే నువ్వు సూస్తావా ఏంది. లేక పెళ్లి పెటాకులు సేయకుండా ఇంట్లోనే పెట్టుకోమంటావా. “ అన్నాడు మునిశేఖరం కోపంగా .

“అక్కర్లే నేను సంధ్యను పెళ్లి చేసుకొంటా. “ అన్నాడు.

అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తాము కలలోగాని ఆ మాట వినడంలేదు కదా అనుకొన్నారు. ముందుగా తేరుకొన్న సావిత్రమ్మ సంతోష పడుతూ తను విన్నది నిజమా కాదా అని“ ఏందిరా నువ్వనేది “అంది.

“అవునమ్మ మీరు ఇనింది నిజమే . నేను సంధ్యను పెళ్లి సేసుకొంటా. నేను ఆలోచించే ఈ మాట సెప్తున్న. “నువ్వు ప్రేమించోట్ని గాదు నిన్ను ప్రేమించేటోన్ని సేసుకోమని “సంధ్యకైతే ఆ రోజు సెప్పినా అది నాగ్గూడా వర్తిస్తాదని తెలిసి వచ్చినాది. నన్ను ప్రేమించేటోళ్లనే సేసుకోవాలని .సంధ్యకన్నా నన్ను ఎవరంతా బాగా ప్రేమిస్తారు సూసుకొంటరు. అందుకే మీ కిష్టమైతే సంధ్యను నేనే సేసుకొంటా. “ అన్నాడు. ఆ మాట అనేటప్పుడు అతనికి నిర్మల రూపం లీలగా కనపడి మాయమయ్యింది..

మునిశేఖరం కుర్చిలోంచి ఒక్క ఉదుటన లేచి రుద్రను గట్టిగా కావలించుకొన్నాడు. రుద్ర చొక్కా అతని కన్నీటితో పూర్తిగా తడిసిపోయింది.

ఒక్కసారిగా అక్కడ వాతవరణం ఆనందంతో తడిసి ముద్దయ్యింది. దాంతో ఎంకట్రెడ్డి , అబ్బిరెడ్డికి రుద్రకు ఎందుకు పొసగడం లేదో అని అడగాలనుకొన్న విషయం మరిచిపోయాడు.

ఎండలు మండి పోతున్నా అక్కడ చాలా చల్లగా ఉంది. దట్టంగా అల్లుకు పోయిన చింత కొమ్మల మధ్యల్లోనే సూర్య కిరణాలు చిక్కుక పోవడంతో చిక్కగా ఉంది నీడ. లయబద్ధంగా కొమ్మలు ఊగుతూ వింజామరలు వీస్తున్నట్లుండగా చల్లగాలి వంటికి తగుల్తుంది. రుద్ర పెళ్లికి ఒప్పుకొన్న విషయంతో పాటు , అబ్బిరెడ్డి బెయిల్ మీద వస్తున్నాడని ఆ వార్త చెవిన పడగానే మిత్రలంతా అక్కడికి చేరుకొన్నారు. రుద్ర పెళ్లిగురించి సంతోషించాల్సిన సమయంలో ఆ వార్త మింగడపడలేదు. ఏదో సాధించిన వాడిలా అతన్ని పూలదండల్తో ముంచెత్తి మేళతాళాలతో వీధుల్లో ఊరేగింపుతో ఇంటికి వచ్చాడని తెలసింది.

అందరి కన్న బికారి ముఖంలో ఆందోళన ఎక్కువై అరుగు మీద కూర్చోబోతుండగా బికారి మీదనే ఓ కాకి రెట్ట వేసింది. ముందుగానే ఎటు పాలుపోక అన్యమనస్కంగా ఉన్నబికారి కోపంతో “చత్ నీయమ్మ నా మీదనే పెంట పెడ్తవా “ అంటు చేతికి అందిన రాయి తీసి దాని పైకి గురిచూసి విసిరాడు. రాయి విసురుగా వెళ్లి గూడును తాకడంతో గూడు కదలింది. ఒక్క సారిగా కావు కావు అంటూ అరవడంతో ఎక్కడ్నుండి వచ్చాయో కాకుల గుంపు వచ్చి కావు కావు మంటు అరుస్తూ రుద్ర వాళ్లు చుట్టు తిరగ సాగాయి. మళ్లీ రాయి విసరబోతుంటే రుద్రనే వారించాడు. అవి ఇంకా రెచ్చిపోతాయని. పక్క చెట్టుక్రింది పోయరంతా. దాంతో కొద్దిగా శాంతించి నట్లు కనిపించినా వాటి నిఘా మాత్రం తగ్గలేదు. వాళ్లవైపే చూస్తు మెల్లగా అరవ సాగాయి.

“వాటికున్న ఐకమత్యం కూడా మన మనష్యులకు .అందుకే అబ్బిరెడ్డి లాంటి వాళ్ల ఆగడాలు అడ్డం లేకుండా పోతుండాది. “అన్నాడు పూజారి. అవకాశం దొరికింది కదా అని .

“ఈ కాకమ్మ కథలు సెప్పాకురా నేను బికారి గాడు మొదట్నుంచి సెప్తనే ఉండాం . మనం రంగంలోకి దిగినదానికి ఎంత మంది సచ్చిండ్రో .ఎంత మంది బాధ పడ్తుండారో సూడు . “ అన్నాడు జాఫర్ .

“అవున్రా .అనుకొన్నది ఒకటి జరిగేది మరోటి మండలాఫీసుల్లో పనులు తొరగా జరిగేలా సూడాలనే అనుకొన్నాం . గాని అది ఇన్ని మలుపులు తిరుగుతుందనుకోలే. “ అని రుద్ర ఇంకా ఏదో చెప్పబోతుంటే మధ్యలోనే బికారి అందుకొన్నాడు ఆవేశంగా

“ ఈసారి మలుపు మనమీదికి తిరుగుతాది ఇంక వోడు. ఇన్ని దినాలు నీ మీదికి ఎందుకు రాలేదో అర్థం కాలే కాని ఎప్పుడు ఏం చేస్తాడో నని భయంగా ఉండాది“ బికారి.

“ఎందుకు రా అట్టా భయపడి చస్తావ్ ఆ కాకులకున్నంత ధైర్యం గూడా నీకు లేకపోయో . ఏం చేస్తాడు వోడు . ఎంత మందిని చంపుతాడు. జైలుపోగానే వోడి పాణం సగం సచ్చినాది. వోడికి మనచేతిలోనే రాసకొచ్చినాది. “అన్నాడు పూజారి.

“వోడికి మనచేతిలో రాసకొచ్చిందో మనకు వాడిచేతిలో రాసుకొచ్చిందో జరిగినేది సూస్తే తెలుస్తాండాది. ఇంకా మొండిగా వోడికి ఎదురుగా పోవడమేంది. వోడి సావు వోడు సావని మనకెలా . సేసిన కాడికి సాలు. ఇక వదిలేస్తాం .వోడి పని వోడిది మన పని మనది. “అన్నాడు బికారి.

“ఈలా జరుగుతుందని నేను అనుకోలేదురా . అసలు ఆఫీసుల్లో అధికారులు అడ్డదారులు తొక్కడానికి కారణం అబ్బిరెడ్డి. “వరదయ్య విషయంలో గాని, రాగులు కుంభకోణంలోగాని , బ్యాంకులో పంటరుణాల కుంభకోణంలో గాని అధికారుల్దేమి పెద్ద తప్పులేదు. అబ్బిరెడ్డి లాంటి రాజకీయనాయకులు తమ పబ్బం గడుపు కొనేందుకు తమకు నచ్చిన అధికారుల్ను వేయించుకొంటూ వాళ్ల చేత అడ్డదిడ్డంగా తమకు తమ అనుయాయులకు అనుకూలంగా పనులుచేయుంచుకొంటూ అడ్డు వచ్చిన వాళ్లని ఇబ్బంది పెడుతుండటంతో అధికారుల్లో కూడ మార్పు వచ్చి .ఎందుకు లేని పోని గొడవలనుకొని అధికారంలో ఉండే పార్టీకి కొమ్ముకాస్తు చట్టాలను తుంగలో తొక్కి వాళ్లు చెప్పిన పనులు అది మంచా చెడ్డా అని ఆలోచించకుండా చేస్తూ పోతున్నారు. పనిలో పనిగా వాళ్లుకూడా స్వంత లాభం చూసుకొంటూ పక్షపాత దోరణితో లంచగొడితనంతో పేట్రేగి పోతున్నారు. అబ్బిరెడ్డి మాత్రం తను చేసిన కుంభకోణం బైట పడినా దర్జాగా బెయిల్ మీద బైటికి వచ్చిండు. కాని అధికారులు బైట పడటం కష్టం. ఎన్ని కుంభకోణాలు బైట పడినా ఇంతే. బెయిల్ మీద బైటకి వస్తడు. సంత్సరాల తరబడి కేసులు కోర్టులో మగ్గిపోతునే ఉంటాయి. “

“నాకు ఒకటి అర్థం కావడంలేరా రుద్ర . అసలు వోడు మన జోలికి ఎందుకు రావడంలా . వోడితో ఫోన్లో అట్టా మాటాడినేది నువ్వే అనేది ఈ పాటికి ఇంకా తెలియలేదనుకోనకోలేం. అదే గాదు రాగుల లోడు పట్టించినేది ఇప్పుడు వోడు జైలుక పోయిందానికి కారణం కూడా నువ్వని ఈ పాటికి తెలిసే ఉంటాది కాని అయినా గమ్మన ఎందుకుండాడు. “ అన్నాడు పూజారి.

“బ్యాంకు కుంభకోణం బైట పెట్టినేది మనమని అని వోడికి ఇంకా తెలిసిండదు తెలిసినాదంటే వోడు ఊరుకోడు “ అన్నాడు జార్జి. .

“ఇంకా తెలియకపోవడానికి వోడేమన్నా సన్నసపక మనిషా తెలిసింటాది. “

వాళ్లు మాట్లాడుకొంటుంటే రుద్ర మౌనంగా ఉండిపోయాడు. రుద్ర మౌనంగా ఉండటం చూచి.

“నువ్వేమనుకొంటుండావురా ఏం చేయాలనుకొంటుండావు“ రుద్ర అన్నాడు స్వామి.

" వోడికి నా గురించి తెలిసినా తెలియకపోయినా అదట్టా ఉండనిలే గాని . వోడి కుంభకోణాలు ఎన్ని బైట పడినా వోడు దర్జాగా బైటికి వస్తుండాడు. అట్టా కాకుండా వోడ్ని కట్టడి చేయాలి. దానికి ఒకటే దారి అగుపిస్తాండాది. అదే వోడికి రాజకీయ పలుకుబడి లేకుండా ఎట్టా సేయాల. టిక్కెటు రాకుండా సూసి, వచ్చినా వోడ్ని గెలనీయకుండా సేస్తే "

రుద్ర వాడి కుంభకోణాలన్ని బైట పడేలా ప్రతిదానికి అడ్డు తగలాలని అంటాడేమో అనుకొన్న వాళ్లకు రుద్ర మాటలు ఆలోచన్లో పడేసాయి.

"వోడికి టిక్కెట్టు రాకుండా సేయడం మనకేడ సాధ్యమైతాది. గెలిచినోడు మంచిగా సేస్తాడని గ్యారెంటి ఏది . ఒచ్చే వోడు వోడ్ని మించినోడు ఉంటాడు.ఏం ప్రయోజనం. అయినా ఇప్పుడు వోడు గెలిసిండాడా ఎమన్నా "అన్నాడు పూజారి.

" అంటే వోడికి పలుకబడి తగ్గడం కాదు .మనకు పలుకుబడి రావడం ఒక్కటే దారి అనిపిస్తాండాది. " అన్నాడు రుద్ర.

" అది ఎట్టా వస్తాది. మనకు ఏదన్నా పదవి ఉండాలా . " బికారి సందేహం వ్యక్తం చేసాడు.

"అవు. రుద్ర మంచి ఆలోచన చేసినవు.నువ్వన్నది కరెక్టు. ఈ పారి ఎన్నికల్లో మీ నాయన్ను నిలబడమనాలా . మీ నాయన గెలిస్తే మనకు అబ్బిరెడ్డి ఆట కట్టవుతాది . మన నియోజక వర్గానికి మంచి జరుగుతాది. " అన్నాడు పూజారి.

అంతా కూడ బలుక్కోని ఎంకట్రెడ్డి చెప్పాలనుకొన్నారు. దాంతో అబ్బిరెడ్డికి తమకు జరిగిన సంఘటనలు గురించి చెప్పక తప్పలేదు రుద్ర.ఒక్క సారిగా ఉలిక్కి పడ్డాడు ఎంకట్రెడ్డి. "ఎంత పనిచేసింర్రా నాకు ఒక్క మాట సెప్పకుండా ఇట్టాటి పనులెందుకు సేసింర్రు. వోడు శవాల్ను తొక్కుంటు పైకి వచ్చినోడు. వోడికి మనిషిని సంపడమంటే సీమను సంపింత సుళువు. వోడు సెప్పినట్టే హైకమాండు ఇప్పటిదాక ఇనింది. ఇంకా ఇంటాది కూడా .వోడి మనసులో ఏం పెట్టుకొండాడో ఇప్పుడు కూడా వోడు నువ్విట్టా సేసినావని నాతో ఒక మాట అనలా "

"వోడికి నేనెవరో తెలిసి గమ్మనుండాడంటే మనకు భయపడ్తుండాడనేగా . "

" వోడు భయపడేటోడు కాదు. సమయంకోసం కాచుక కూర్చుని ఉంటడు. వోడు సేసే పనులు నాకు తెలుసు కాని వోడు ఇన్ని ఘోరాలు సేస్తాంటే నాకు ఎందుకు సెప్పలా నేను హైకమాండుకు సెప్పేటోన్ని కందా .వోడి ఇషయంలో మీరెందుకు తల దూర్చింర్రు. " అన్నాడు కోపంగా. సమయం దొరికింది కదా అని తన మనసులో మాట బైట పెట్టాడు రుద్ర.

"వోడట్టా రెచ్చి పోయి అడ్డమైన పనులు చేసేది రాజకీయ అండ సూసుకొనే కదా . అది వోడికి లేకుండా సేయాలా దానికి మీరు వచ్చే ఎన్నికల్లో నిలబడి గెలిసి . వోడికి భవిషత్తునేది లేకుండా సేయాల నియోజక వర్గం అప్పుడు బాగుంటాది "అన్నాడు రుద్ర.

"ఏందిరా నువ్వు అబ్బిరెడ్డితో ఎందుకు పెట్టుకొన్నావని నేను అంటుంటే నువ్వు నన్ను ఎన్నికల్లో పోటీ సేయమంటాండావా . ఎలక్సన్లలో నిలబడటం సిన్న పని అనుకొంటుండావా. సిన్మాలోగా తమాషా కాదు. సర్పంచుగా గెలవాలంటేనే లక్షలు గుమ్మరించాల్సిన రోజులివి.. ఎమ్మెల్లేకి కోట్లు పెట్టందే గెలవడం కష్టం. ఓటేస్తే నాకేంస్తావు. నా కేం వస్తాది అని సూసేవోడే తప్ప సమాజ పరంగా బాగు పడే పార్టీ రావాలని ఎవరు సూడటంలా డబ్బులు పంచకుండా సారాయి పోయించకుండా తాయిలాలు పంచకుండా సాక్షాత్తు ఆ నేతాజో, బాపూజో వచ్చి నిలబడినా ఎలక్షన్లలో గెలవడం సాద్దెం కాదురా "

" రుద్రకు ఈ మద్దెన మంచి పేరు వచ్చినాది. మీకు మండలాల్లో మంచి పేరు ఉండాది . మీరు గెలుస్తారు . "అన్నాడు పూజారి.

ఎంకట్రెడ్డి నవ్వాడు. " ఏందిరా మీరనేది . ఎమ్మెలే గెలవగలడం అంటే అంత ఈజీ అనుకొంటుండారా. దాని ఎనకలా ఎంత బలం ,బలగం, డబ్బులవసరమైతాయో మీకు అర్థం కావడంలా. రోజులు మారిపోయినయిరా ఎమ్మెల్లే గా గెలవాలంటే ఆషామాషీగాదు .. మన నియోజక వర్గాన్ని తీసుకొంటే దీనికి నాలుగు మండలాలుండాయి. ఒకో మండలానికి పదైదు కాడ్నినుండి ఇరవైదాక అన్ని కలిసి అరవై ఏడు దాకా రెవిన్యూ గ్రామాలు వోటికి మళ్లీ మూడో నాలుగో మజరాలు . అంటే దాదాపు రెండువందల నుండి మూడు వందలలోపు గ్రామాలుండాయి ..రెండు లక్షలకు పైబడి ఓటర్లుండారు. దాంట్లో సగమంది పైనే మన పక్కన తిప్పుకోవాలంటే సాద్దం గాని పని అదిగాక ప్రతి గ్రామంలోన పాలక పార్టీ ప్రతి పక్ష పార్టి వోళ్లకు ఇద్దరో ముగ్గురో చోటా నాయకులుంటారు. వాళ్ల కనుసన్నల్లో చెప్పుచేతల్లోనే ఓటర్లుంటారు. అబ్బిరెడ్డికి అట్టాటోళ్లు ప్రతి గ్రామంలో ఉండారు.వోళ్లతో సంబంధం లేకుండా ఓటర్లను మన పక్క తిప్పుకోలేం. ఆ చోటానాయకులకు మన ఆశయాలు మన మంచి పనులు పనికి రావు వోళ్ల సేతుల్లో లక్షలు గుమ్మరించాలి .వోళ్ల గొంతెమ్మ కోరికలు తీర్చాలా.అంతెందుకు రెండు మార్లు ఓడి పోయిన అబ్బిరెడ్డి డబ్బులెంత పంచిండు. అయినా ఓడిపోతుండాడు. దానికి కారణం వోడు సెడ్డోడని గాదు. అంతో ఇంతో మంచోడైనా అవతలోడు కూడా వీడికన్నా ఇంకా ఎక్కువుగా డబ్బులు పంచబట్టి . ఎవరెక్కువ డబ్బులు పంచితే వాడే గెలుస్తాడు. అదిగాక మీరనుకొన్నట్టు ఎలక్సన్లలో గెలిచినంత మాత్రనా సరిపోదు. . ఇప్పుడు అబ్బిరెడ్డి ఎమ్మెల్లేగా ఉండాడా ఎమన్నానా. పైన సపోర్టుండాది కాబట్టి, గెలిచిన ఎమ్మెల్లే కన్నా పలుకుబడి ఉండాది వీడికి. వీడు చెప్పినట్లే జరుగుతుండాది నియోజక వర్గంలో రేపు గెలిసి ఎమ్మెల్లే అయినా పాలకపార్టి ఎమ్మెల్లే అయితేనే పలుకుబడి ఉంటాది. లేకపోతే ఎంత గొంతుచించుకొన్నా పయోజనముండదు. ఇంత తతంగముండాది .అబ్బిరెడ్డిని పక్కన పెట్టేదానికి అధిష్టానం ఒప్పుకోదు. నువ్వు మంచి

చేస్తాండావని తెలుస్తాండాది. అది నాకిష్టమే కాని వోడితో వైరం అంత మంచిది కాదు వాడు మంచి ఫాంలో ఉండాడు. " అన్నాడుఎంకట్రెడ్డి.

"లేదు నాయనా వోడు సేసే అక్రమాలు సాక్ష్యాలతో సహా బైట పెడ్తాం. వోడి పలుకు బడి తగ్గుతాది. "

"లేదురా ఎన్నికలు దగ్గర్లో వస్తాండాయి సమయం లేదు. అదిష్టానానికి వోడు ఎన్ని మర్డర్లు సేసిండో , ఎన్ని కుంభకోణాలు సేసిండో అక్కర్లా వోడు గెలుస్తాడా లేదా అని సూస్తరు. వోడికే టిక్కెటిస్తరు. ప్రజలు అంతే వోళ్లకు అవేం పట్టవు. అన్యాయనికి బలైపోయే కొంత మంది ఓటు వేయకపోవచ్చేమో కాని మిగతా వోళ్లు వోడిచ్చే డబ్బుకు ,లోకల్ పాలిటిక్స్ కు భయపడి ఓట్లేస్తరు. రెండు మార్లు ఓడిపోయిన వోడు ఈపారి డబ్బులు నీళ్లలాగ కర్చుపెట్టాడు. దౌర్జన్యానికి వెరవడు. రూలింగ్ పార్టీ వాడికి అండగఉండనే ఉంది."

చాలా సేపు తర్జన బర్జనులు జరిగాయి. అబ్బిరెడ్డి మీద మంచి అభిప్రాయంలేని ఎంకట్రెడ్డి , రుద్రలాగ వాడికి చెక్ పెట్టాలని మనసులో ఉంది కాని ఫలితం ఉండదేమోనని వెనకంజ వేస్తున్నాడని అర్థమయ్యింది రుద్ర బృందానికి.

ఆలాంటి సమయంలోనే ఓ దుర్వార్తతో నిద్ర లేవాల్సివచ్చింది రుద్రకు. మిట్టమానిపల్లెనుండి వచ్చిన ఫోన్ అది.

"అన్నా వరదయ్య పొలంలో పంట కోసి నూర్పిడిచేయకుండా పెట్టిన వామి పూర్తిగా కాలిపోయింది. ఎవరో నిప్పుపెట్టారు. తెల్లారుతుండగా వామి కాలుతుండటం చూసి నేను పోయినా . వామి పూర్తిగా కాలిపోతుండే ఆర్పేదానికి వీలు లేకుండే .ఆడకి నేను ఫైరింజనుకు ఫోన్ చేసిన . ఫైరింజన్ మంటలార్పనాక సూస్తే అందులో ఎవర్దో పూర్తిగాకాలిపోయిన . గుర్తుపట్టదానికి వీలు లేని శవం కనపడినాది. రాత్రి కాపలగా నరేంద్ర ఆడ పడుకోవడం సానా మంది సూసిండంట్రా .అందుకే అంతా అది వరదయ్య కొడుకు నరేంద్రే శవమే అనుకొంటుండారు"

ఖిన్నుడైపోయాడు రుద్ర. చేయాలనుకొన్నది ఒకటి జరుగుతున్నది మరొకటి . ఏ కుటుంబాన్నైతే రక్షించాలనుకొంటున్నాడో ఆ కుటుంబం అన్యాయంగా తన వల్లే బలి అవుతుంటే ఏం చేయాలో పాలుపోలేదు. వరదయ్య ఊరుచేరుకొన్న రుద్రకు వరదయ్య భార్యను ఓదార్చడం సాధ్యం కాలేదు. కూతురి ప్రసవసమయం దగ్గర పడటంతో ఆమె కూతురి దగ్గరికి వెళ్లింది వార్త తెలిసి గుండెలు బాదుకొంటు వచ్చింది. పొలంలోనే పడి పడి దొర్లి ఎడ్వసాగింది. అది చూచి పల్లెలో చాలమందికి వరదయ్య కుటుంబం మీద జాలి సోమిరెడ్డి మీద అందరికి అసహ్యమేర్పడింది లోలోపల. కాని బైటికి ఎవరు నోరువిప్పలేదు.. సోమిరెడ్డి ఆ రాత్రి సమయంలో మోటరు బైక్ వేసుకొని పొలం వైపు వెళ్లడం ఒకరిద్దరు చూసినా . సోమిరెడ్డి మీద నేరం మోపడానికి ఎవరికి ధైర్యం చాల్లేదు. . కాలిన గడ్డి వామిలో గుర్తుపట్టలేని విధంగా కాలిన శవంతో పాటు నరేంద్ర ఇంటినుండి తీసుకపోయిన టార్చిలైటు ,ఈటె ,చెప్పులకున్న ఇనుప బకెళ్లు ఆనవాళ్లుగా దొరికాయి. దొరికిన

వస్తువులన్ని ఫోరన్సిక్ వాళ్లు పరీక్షలకోసం లాబ్కు పంపారు. దొరికిన వస్తువుల వల్ల , నరేంద్ర ఆరోజు అక్కడకాపలా కు రావడం చూచిన వాళ్ల వాఙ్మూలం వల్ల శవం నరేంద్రేనని పోలీసులు ప్రాధమికంగా నిర్దారించి కేసు బుక్ చేసారు. గతంలో సోమిరెడ్డికి వరదయ్య కుటుంబంతో ఉన్న మనస్పర్ధలదృష్ట్యా ,సోమిరెడ్డి ఉన్నట్లుండి అదృశ్యం కావడంతో ఆ పని సోమిరెడ్డి చేసి ఉంటాడని నరేంద్ర తల్లి ఫిర్యాదు ఇవ్వడంతో కేసు ఫైలు చేసారే కాని అబ్బిరెడ్డికి అనుకూలంగా ఉన్న సిఐ వల్ల కేసు ముందుకు సాగలేదు. నత్త నడకన సాగసాగింది కేసు.

కొన్ని సంఘటనలు కొంత మందిని పూర్తిగా మార్చేస్తాయి. సావిత్రమ్మను ఆలాగే మార్చేసాయి. వరదయ్య మరణంతో అబ్బిరెడ్డి సోమిరెడ్ల మీద ఉన్న కోపం నరేంద్ర చావుతో రెట్టింపు అయ్యింది. అతని తల్లి కడపు కోత బాగా కలిచివేసాయి. రెండు రోజులు ముందు రుద్ర చేసే పనులు వల్ల అతనికేమైనా అవుతుందని భయపడిన సావిత్రమ్మ జరిగిన సంఘటనతో మార్పు వచ్చింది. నరేంద్ర మరణం ఆమెను అంతగా మార్చివేసింది.

“అబ్బిరెడ్డి చేసే పాపిష్టి పనుల పార్టీ వోల్లకు సెప్పినా ఇనుకోరని మనమెందుకు ఊరకుండాలా మనమేం సేయలేమని ఎందుకనుకోవాలా వోడికేమన్నా కొమ్మలొచ్చినాయ ఏంది. అధికారముండాదని వోడట్ట నీల్గుతుంటే ఆ నీల్గుడు తగ్గించేందుకు ఏదో ఒకటి సేయాలా అంతో ఇంతో బలముండే మనమే అట్టా గమ్మనుంటే ఎట్టా . ఇయ్యాల వోళ్లకు జరిగినేది రేపు మనకు జరగదని గ్యారెంటి ఏంది. “ ఎంకట్రెడ్డితో వాదనకు దిగింది.

ఎప్పుడు భయపడి అది చేయద్దు ఇది చేయద్దు అనే తన భార్య అలా మాట్లడటంతో తనేనా అలా మాట్లాడేది అన్న అనుమానం వచ్చింది ఎంకట్రెడ్డికి. రుద్రకూడా ఆశ్చర్య పోయాడు.

“అదేందే ఉన్నట్టుండి అట్టా అనేసినావు. రుద్రకు ఏమైతాదో అని భయపడే నువ్వు ఇప్పుడు వాన్ని రెచ్చగొడ్తావేంది. . “అన్నాడు ఎంకట్రెడ్డి.

“వోడు సేసిన ఘోరాలు సూస్తుంటే ముందు వోడి పీడ జనాలకు పోవాలనిపిస్తుండాది. రుద్ర వోడి జతగాళ్లు చెప్పేది మంచిదనిపిస్తుండాది. నువ్వు ఎన్నికల్లో నిలబడితే ఏమైతాది. గెలిస్తే వోడి ఆట కట్టైతాది. మనం ఓడిపోతామని ఎందుకనుకోవాలా. వోడు సేసే అన్నాయల్ను ఎదరుతిరగక పోతే నువనుకొనే ప్రజలకు మంచి ఎట్టా జరుగుతాది. “అంది సావిత్రమ్మ.

“అవున్నాయనా ఒకేలా వోడు ఎలక్షనల్లో గెలిచి వోడికి మంత్రిపదివిలాంటిది వస్తే వోడ్ని ఏమి సేయలేం. వోడు మన మీద పగపడ్తాడు. ఇప్పుడు ఏమి సేయలేక సమయంకోసం ఎదురు సూస్తుండదు. మన కత పక్కన పెట్టు వోడు సేసే ఆగడాలకు అడ్డుంటాదని నువ్వనుకొంటుండావా . డబ్బుతో దౌర్జన్యంతో అబ్బిరెడ్డి గెలుస్తాడని నువ్వనుకొంటుండావు. కాని మంచి పనులు చేస్తే జనం ఆదరిస్తారని మేమనుకొంటుండాం.అది నిజమని మాకు వచ్చిన ఆదరణ వల్ల అర్థమైనాది గూడా. ఆఫీసుల్లో పని జరక్క పోతే చేసిన చిన్న సహాయానికే అంతో ఇంతో పేరువస్తే , గ్రామాల్లో లెక్కలేనన్ని

సమస్యలున్నాయ్... వోటిని తీర్చే ప్రయత్నం సేస్తే ... పల్లె పల్లె తిరిగి ప్రైజలకు ఏం గావాలో తెలుసుకోని . వాళ్ల అవసరాలు తీర్చగలిగితే ... ప్రజాబలం కూడకట్టుకొంటే ...ఆ బలం ,బలగంముంది ఏ పదివి అవసరం లేదు.దాని ముందు అబ్బిరెడ్డి లాంటి వాళ్లు చేసే నీచ రాజకీయలకు అంతంపలకవచ్చు కందా. "

"ఇ దినం సేసిన మంచిని రేపటికి మరిచిపోతుండ్రా జనాలు. వాళ్లు మనెంట ఉంటారనుకోవడం బ్రమ. అంతే కాదు ఎవరు ఎవర్ని నమ్మడంలా . తన స్వార్థం కోసం వోడేదో సేస్తున్నాడు, వోడికేం లాభంలేందే ఆపని సేస్తున్నాడనే అనే నమ్మకం ప్రజల్లో పెరిగపోయింది. అట్టాంటిది నువ్వు సేసేది మంచి అని నీ ఎంట వస్తారనుకొంటావ్ అది జరిగేది కాదు. "

" అందరు అట్టోటోళ్లు ఉండరు నాయనా. సూస్తాం మనం ప్రయత్నం మనం సేస్తాం. మంచి చేయాలనుకోని మన మనసులోన ఉండాది. మనం సేసే పని మనం సేస్తాం. మనం సేసే పని మంచిదో కాదు వోళ్లనే తేల్చుకోని మన ఎంట వస్తే రాని లేక పోతే పోని మనం పది మందికి మంచి సేసినామన్న తృప్తి ఉంటాది. అందరు కాకపోయినా కొందరన్న మన ఎంట వస్తరన్న నమ్మిక నాకు ఉండాది . మన ఎంట ఉండే బలం తయారైతాది."

. " అవును బావా రుద్ర సెప్పినట్లు సేస్తాం. అబ్బిరెడ్డికి మనపైన పగ పెరిగినాది. నేను సంధ్యను వోడి కొడకిస్తానని మాట తప్పి రుద్రకియ్యడం వాడికి నా మీద కూడా కోపం వచ్చినాది అది పక్కన పెట్టేయ్ . ఎంత కాలమని ఎదుగు బొదుగులేని రాజకీయాలు సేస్తు కూకూంటావ్. మనకు రాజకీయంతో పాటు మంచి చేయాలని ఆలోచన ఉండాది. వోడికున్నంత బలం లేకపోయినా , మీరు మీరు సేసే పనుల్ను నమ్మే మనుష్యుల బలం మనకుండాది. ఎందుకు ఎనకడుగు ఏయాలా " మునిశేఖరు కూడా అలా మాట్లడే సరికి పునరాలోచనలో పడ్డ ఎంకట్రెడ్డి రుద్ర చేసే పనులకు తన ఆమోదం తెలిపాడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS